


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




మంగళవారం 02 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 365 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రజా పాలన: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సందేశం టైమ్స్, కాగజ్‌నగర్, జూన్ 02, ప్రతినిధి: కాగజ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్ల ప్రజాపాలనకు, గత పదేళ్ల పాలనకు మధ్య స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇది మాటల్లో కాదు, పనుల్లో కనిపిస్తున్న మార్పు అని పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. గత పాలకుల హయాంలో గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట వంటి ప్రాంతాల్లో తప్ప మిగతా ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కనిపించలేదని విమర్శించారు. పేదల గోడును పట్టించుకోకుండా వారి సొంతింటి కలను విస్మరించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల మంజూరులో కులం, మతం, పార్టీ అనే భేదం లేకుండా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి లేదా రెండు విడతలతో ముగిసే కార్యక్రమం కాదని, రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్ష నాయకులకు బహిరంగ సవాల్ విసిరానని, వాస్తవాలపై చర్చకు రావాల్సింది పోయి వారు అసత్య ప్రచారాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పేదల సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమంలో భాగస్వామి కావడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో రెండు నెలల్లో అదనంగా 2 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. గిరిజన తండాలు, గ్రామాల్లో అదనంగా 20 నుంచి 30 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. తన నియోజకవర్గంలోని ఓ గిరిజన తండాలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న యువకుడు ఆనందంతో తనకు పెళ్లి కుదిరిందని చెప్పడంతో కళ్లలో నీళ్లు తిరిగాయని భావోద్వేగంగా వివరించారు. గత పాలకులు పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని భావించి కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్ష కోట్ల రూపాయలు దోచుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. మేము ఇళ్ల పేరిట బొమ్మలు చూపించే ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. ఈ వేదికపై ఉన్న ప్రతిపక్ష సభ్యులు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రశంసించారని, నిజాన్ని ఒప్పుకున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రెండు, మూడు, నాలుగు విడతలుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి రెండు వేల ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అందులో గతంలో మొండి గోడలతో ఆగిపోయిన ఇళ్లు, గృహలక్ష్మి పథకం కింద కాగితాలకే పరిమితమైన ఇళ్లను పూర్తి చేసేందుకు ఒక్కో నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులందరం ప్రత్యేక సైన్యంలా పనిచేస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## ఆదిలాబాద్ అభివృద్ధే లక్ష్యం.. గూడేల్లో గుడిసెలు కనిపించొద్దు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, కాగజ్‌నగర్, జూన్ 02, ప్రతినిధి: కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో ముందుకు నడిపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గిరిజన, ఆదివాసీ బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదలకు పక్కా ఇండ్లు కావాలని అడవి బిడ్డలు కోరడంతో వెంటనే నియోజకవర్గానికి 3500 ఇండ్లతో పాటు ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా 21 వేల ఇండ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో గూడేల్లో ఒక్క గుడిసె కూడా కనిపించకుండా చేయడమే తమ సంకల్పమని, పార్టీలకు అతీతంగా ప్రతి గిరిజన గూడెంలో అవసరమైన ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదలలో ఒక్కరోజు కూడా జాప్యం చేయలేదని, ఏడాదిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించామని చెప్పారు. సెప్టెంబర్ 17, 2026 నాటికి మరో లక్ష ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేలా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. ఇండ్లు లేని వారి జాబితా సిద్ధం చేసి అందించాలని, ఇండ్లు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఆదిలాబాద్ జిల్లాకు ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదని విమర్శించిన ముఖ్యమంత్రి, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందుకోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినా స్పందన లేదని, రైతుల అవసరాలను అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తైతే గ్రావిటీ ద్వారా లక్షలాది ఎకరాలకు నీరు అందుతుందని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. రైతు ప్రయోజనాల కోసం ఎవరినీ లెక్కచేయనని, అవసరమైతే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటికైనా వెళ్లడానికి సిద్ధమని తెలిపారు. పోలవరం కోసం ఏడు మండలాలను ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి రెండువేల ఎకరాలు ఇప్పించలేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని సేకరించిందని, అయితే కేంద్రం కొనుగోలు చేయడంలో ముందుకు రావడం లేదని ఆరోపించారు. కనీస మద్దతు ధర ప్రకటించిన కేంద్రం వడ్లు, మక్కలు ఒక్క గింజ కూడా కొనడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సేకరించిన వడ్లు, తడిసిన ధాన్యం, మక్కలను కేంద్ర ప్రభుత్వం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని, తీసుకోకపోతే జూన్ 15న ధాన్యాన్ని ఆయన ఇంటి ముందు పోస్తామని హెచ్చరించారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అమరవీరుల త్యాగాలతో సాధించిన తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం: సీఎం రేవంత్ రెడ్డి

# తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 02, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభసందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను సాకారం చేసుకుని తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



# సొసైటీ అందిస్తున్న ఆరోగ్య సేవలు అభినందనీయం: కలెక్టర్ ప్రతిమా సింగ్






సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో, మేడ్చల్ మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు జిల్లా అధికారులతో పాటు ప్రజలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీరాం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి. శ్రీనివాస్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాస్ రావు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, ఎస్సై సత్యనారాయణ, సభ్యులు శంకర్ దయాళ్ చారి, తోట శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొని సేవలందించారు.




# పొగాకు రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య, విద్య, రవాణా, పోలీసు శాఖ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, నోటి సంబంధిత వ్యాధులు, అకాల మరణాలకు పొగాకు ప్రధాన కారణమవుతుందని పేర్కొన్నారు. పొగ త్రాగని వ్యక్తులు కూడా పరోక్ష ధూమపానం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న పాన్ దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు పోలీసు శాఖ, విద్యాశాఖ సమన్వయంతో పగడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు రహిత సమాజ నిర్మాణం కోసం ఆరోగ్య శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు, చట్ట అమలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎస్పీ ప్రసన్నకుమార్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ ప్రత్యేక అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, సీఎంఓ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డీడబ్ల్యూవో హేమభార్గవి, డీపీఆర్వో రామచంద్రరాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీ శాఖ అధికారి జోజి, డిఆర్డిఓ పీడీ శ్రీనివాసరావుతో కలిసి కార్యక్రమాల నిర్వహణ, కార్యాచరణ ప్రణాళిక, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా మొక్కల నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రకృతి సంరక్షణపై చర్చా వేదికలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అటవీశాఖ అధికారులు, రేంజ్ ఆఫీసర్లు, వ్యవసాయ, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, డీపీఆర్వో రామచంద్రరాజుతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన కలెక్టర్ సభా ప్రాంగణం, వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జూన్ 02న ఉదయం 7:45 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించనున్నారని తెలిపారు. అనంతరం ఉదయం 8 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ చేసి పోలీసు శాఖ గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. 8:10 గంటల నుంచి 8:30 గంటల వరకు జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథి ప్రసంగం ఉంటుందని తెలిపారు. అలాగే 8:30 నుంచి 8:45 గంటల వరకు జిల్లాలోని పాఠశాలల విద్యార్థులతో తెలంగాణ రాష్ట్ర సాధనను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 8:45 నుంచి 9 గంటల వరకు అమరవీరులకు సన్మానం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని కలెక్టర్ వెల్లడించారు.




# వైద్య ఆరోగ్య శాఖ అక్రమ నియామకాలపై విచారణ జరపాలి: సీపీఎం డిమాండ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: మెదక్ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా చేపట్టిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. ఆడవయ్యా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేయకుండానే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాలు జరపడం తీవ్ర అభ్యంతరకరమని విమర్శించారు. మెదక్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ పరిధిలోని బస్తీ దవాఖాన, జిల్లా జనరల్ ఆసుపత్రి పరిధిలోని డయాలసిస్ సెంటర్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు తదితర అనేక విభాగాల్లో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఈ అక్రమ నియామకాలలో జిల్లా స్థాయి అధికారుల బంధువులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఇటువంటి నియామకాల వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడంతో పాటు నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని అక్రమ నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మంచు నగేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. పద్మ, పార్టీ కార్యకర్తలు లచ్చా గౌడ్, దుర్గా, కవిత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి దామోదర రాజనర్సింహ





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 02, ప్రతినిధి: రేగోడు మండలం గజవాడ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించిన సందర్భంగా మంత్రి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు చేసిన నేపథ్యంలో మెదక్ జిల్లాలో కూడా నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గజవాడ గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామ ప్రజలు భాజాభజంత్రీలు, బాణాసంచాతో ఘన స్వాగతం పలికారు. ముందుగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను, రూ.10 లక్షలతో నిర్మించిన గ్రామ మహిళా సమైక్య భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఐదు ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, సర్పంచ్ సరోజిని కిషన్ పాల్గొన్నారు. రంగురంగుల పూలతో, మామిడి తోరణాలతో, రంగవల్లులతో అలంకరించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ఆనందోత్సాహాలతో ముస్తాబు చేసుకుని తమ సొంతింటి కల నెరవేరిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తోందన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందిస్తున్నామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ నరసింహులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సింగ్ విద్య బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి దామోదర రాజనర్సింహ

సందేశం టైమ్స్, అందోల్ టౌన్, జూన్ 02, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోగిపేట నర్సింగ్ కాలేజ్, హాస్టల్ భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సింగ్ కాలేజ్, హాస్టల్ భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నర్సింగ్ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. భవనాలను పరిశీలించిన అనంతరం నిర్మాణ పనులపై పలు సూచనలు చేసిన మంత్రి, అనంతరం నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## తారా కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహణ


సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్: తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో పొగాకు వినియోగం అధికంగా ఉందని, యువత పొగాకు పదార్థాలకు బానిసై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా ధూమపానం చేసేవారి పక్కన ఉండి ఆ పొగను పీల్చే వారికి కూడా క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తులను అమ్మడం, కొనుగోలు చేయడం కూడా నేరమని తెలిపారు. నేటి యువత ధూమపానం, మద్యపానం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరమైన జీవితం గడపగలరని సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## శానిటైజర్ వినియోగం, పరిశుభ్రతపై అవగాహన సమావేశం

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 02, 2026: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని సంఘపేట రైతు వేదికలో మంగళవారం శానిటైజర్ వినియోగం మరియు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధికారి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై శానిటైజర్ వినియోగం, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాల అమలుపై చర్చించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శానిటైజర్‌ను ప్రజలు సరైన విధంగా వినియోగించేలా అవగాహన కల్పించాలని, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో శానిటైజర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత, వ్యాధుల నివారణలో శానిటైజర్ ప్రాధాన్యతను వివరించారు. గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతపై చైతన్యం కల్పించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వార్డు సభ్యులు తమ గ్రామాల్లో ఈ సూచనలను అమలు చేస్తామని తెలిపారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

## భూ తగాదాలతో మనస్థాపం.. వ్యక్తి ఆత్మహత్య



సందేశం టైమ్స్, చౌటకూర్ మండలం, జూన్ 02, ప్రతినిధి డి. రమేష్: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలో భూ తగాదాల కారణంగా మనస్థాపానికి గురైన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని మిగిల్చింది. స్థానికుల వివరాల ప్రకారం పంతుల్ శ్రీశైలం అనే వ్యక్తి ఆదివారం రాత్రి వ్యవసాయ భూమిలోని చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. సుమారు రెండు నెలలుగా ఇంటి స్థలానికి సంబంధించిన వివాదం కారణంగా ఆయన తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. సుమారు 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తుండగా పక్కవారు అడ్డుపడుతున్నారని, ఇంటికి సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ నిర్మాణానికి అనుమతించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. ఈ మానసిక వేదనతోనే శ్రీశైలం ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పుల్కల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విశ్వజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.




## నెలరోజుల పాటు పోలీసు యాక్ట్ అమలు.. అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలకు నో

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరిన ఎస్పీ, నిబంధనలను ఉల్లంఘించి అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలి: ఎస్పీ పరితోష్ పంకజ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదును ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు సేకరించారు. ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్న ఎస్పీ, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన గడిపెద్దాపూర్ విద్యార్థిని



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన సూరన్న గారి చైతన్య ప్రతిష్ఠాత్మక త్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. చైతన్య తండ్రి మొగులయ్య కాగా, ఆమె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గడిపెద్దాపూర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసింది. తన కృషి, పట్టుదలతో స్కూల్ టాపర్‌గా నిలిచి త్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో సీటు సాధించడం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు కొనియాడారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో డా. కె. లలితాదేవి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, ప్రతినిధి: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. సోమవారం ఆమె జోగిపేట ఏరియా ఆసుపత్రితో పాటు తాలేల్మ, నేరేడిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి, విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రులలోని వివిధ విభాగాలు, మందుల నిల్వలను తనిఖీ చేసి గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించడంతో పాటు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని, అదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డా. లలితాదేవి పేర్కొన్నారు.

## ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 02, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని చెల్మెడ కలాన్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను నెరవేర్చుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి పటేల్, మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ రామస్వామి, ఎంపీడీవో చంద్రయ్య, ఎంపీవో అండాలమ్మ, గ్రామ సర్పంచ్ రాధా బైజోష్, కంకోల్ సర్పంచ్ నగేష్, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు ఇస్మాయిల్, హౌసింగ్ ఏఈ అంకుష్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బండి వెంకటేశ్వర్లుకు మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు నివాళి



సందేశం టైమ్స్, తిర్లాపురం, జూన్ 02, ప్రతినిధి: తిర్లాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండి రామారావు, ఎంఆర్వో బండి నాగేశ్వరరావు గార్ల తండ్రి బండి వెంకటేశ్వర్లు సోమవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఖమ్మం మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు వారి నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి వెంకటేశ్వర్లు గ్రామాభివృద్ధి, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణం గ్రామానికి, పార్టీ శ్రేణులకు తీరని లోటని పేర్కొన్నారు. బండి వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై మెరిసిన సంగారెడ్డి మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, జూన్ 02, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: నేటి తరం యువతకు స్ఫూర్తినిచ్చేలా అంతర్జాతీయ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టారని పటాన్‌చెరు శాసనసభ్యులు, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. శ్రీలంక రాజధాని కొలంబోలో గత నెల 23, 24 తేదీల్లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అంతర్జాతీయ మీట్‌లో భారతదేశం తరఫున సంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన 14 మంది క్రీడాకారులు 35 నుంచి 100 సంవత్సరాల వయస్సు వర్గాల్లో పాల్గొని వివిధ విభాగాల్లో మొత్తం 52 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని గత 20 సంవత్సరాలుగా క్రీడా అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ 80, 90 ఏళ్ల వయస్సులోనూ అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఫహీం ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి శామ్యూల్, ఉపాధ్యక్షులు బాలయ్య, నరేందర్ రెడ్డి, భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లోర, సభ్యులు కరుణాకర్ రావు, మల్లయ్య గౌడ్, నిర్మల, అనసూయ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## VOAల సమ్మెకు బీఆర్ఎస్ నాయకుల మద్దతు.. న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి: లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, చింతకాని, ఖమ్మం జిల్లా, జూన్ 02, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఐకెపి VOAల జేఏసీ పిలుపుమేరకు చింతకాని మండలంలో ఐకెపి వివోఏలు 15వ రోజు సమ్మెలో భాగంగా తమ నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లింగాల కమల్ రాజు గారు పాల్గొని VOAల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో VOAలతో కలిసి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో VOAలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగిన వేతనం చెల్లించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.5,000 వేతనంతో వారి కుటుంబాలు ఎలా జీవిస్తున్నాయో ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. VOAలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సీతక్క గారు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు VOAలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని అసెంబ్లీలో కోరిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు ఆ విషయాన్ని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన 1) కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి, 2) సర్వీస్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి, 3) అర్హులైన VOAలకు సీసీ పదోన్నతులు కల్పించాలి, 4) ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్, మాజీ వైస్ ఎంపీపీ గురుజాల హనుమంతరావు, కోమట్లగూడెం సర్పంచ్ పరిచుద్దరావు, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్, బీఆర్ఎస్ నాయకులు జి. శ్రీనివాస్ రావు, బొడ్డు వెంకట రామారావు, కొండల రావు తదితరులు, అలాగే మండల పరిధిలో పనిచేస్తున్న VOAలు పాల్గొన్నారు.



## నాలా నిర్వహణలో నిర్లక్ష్యం.. 27వ వార్డులో ముంపు భయం: కౌన్సిలర్ స్రవంతి

సందేశం టైమ్స్, జహీరాబాద్, జూన్ 02, ప్రతినిధి: జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో నాలా నిర్వహణలో మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ స్రవంతి నామరవి కిరణ్ ఆరోపించారు. శాంతినగర్, బాగారెడ్డిపల్లి ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహించే ప్రధాన నాలా చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందు చేపట్టే నాలాల శుభ్రత పనులు ఈసారి నిర్వహించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నాలా పొంగిపొర్లి మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు అసౌకర్యం కలిగించిందని పేర్కొన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల బెడద పెరిగి, పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఒకప్పుడు వెడల్పుగా ఉన్న నాలా కబ్జాల కారణంగా కుంచించుకుపోయిందని ఆరోపించిన ఆమె, అధికారులు వెంటనే స్పందించి నాలాను శుభ్రపరిచి కబ్జాలను తొలగించాలని, భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో 147వ ర్యాంకు సాధించిన ఖమ్మం విద్యార్థి కిలారు పాన్విక్ చౌదరి



సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 02, ప్రతినిధి: 2026 ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థి కిలారు పాన్విక్ చౌదరి జనరల్ కేటగిరీలో ఆల్ ఇండియా 147వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆయన, జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 1251 ర్యాంకు, టీజీ ఎప్‌సెట్‌లో 14వ ర్యాంకు కూడా సాధించాడు. పాన్విక్ చౌదరి తల్లి స్వాతి ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగిగా ఉండగా, తండ్రి నాగేశ్వరరావు ఖమ్మంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో కంప్యూటర్ ఇంజనీర్‌గా పెద్ద కంపెనీలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని విద్యార్థి తెలిపారు. ఈ విజయంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఆయనను అభినందించారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సందేశం టైమ్స్, సూర్యాపేట, జూన్ 01, ప్రతినిధి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నాగారం మండలం ఫణిగిరి ఐకెపి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ కేంద్రానికి మొత్తం 1571 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, ఇందులో ఇప్పటికే 1488 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల ఏపీఎం వెంకటరెడ్డి మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నాగారం మండలంలోని మహిళలకు మహిళా శక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన బస్సులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో మహిళా శక్తి భవనాలు నిర్మించడం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, డీఎస్‌ఓ మోహన్ బాబు, మండల ఏపీఎం వెంకటరెడ్డి, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.